సురక్షతో గ్రామీణులకు ఉన్నత వైద్యం

- హోం మంత్రి తానేటి వనిత
- పెద్దేవం వైద్య శిబిరం సందర్శన



నల్లజర్ల మండలం పోతవరం శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న గైనకాలజిస్ట్ ఝూన్సీరాణి



పెద్దేవం శిబిరంలో నిర్వహిస్తున్న కంటి పరీక్షలను పరిశీలిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

తాళ్లపూడి: గ్రామీణులకు కూడా ఉన్నత వైద్యం అందించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఊరూరా ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని పెద్దేవంగ్రామంలో బుధవారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ గ్రామంలోని 300 మందికి వైద్యాధికారులు వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను మంత్రి వనిత పరిశీలించారు. అక్కడి ఆహార పదార్థాలను శిబిరానికి వైద్య కోసం వచ్చిన వారికి అందజేశారు. మంత్రి వనితను పెద్దేవం గ్రామ నాయకులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, సర్పంచ్ తిరిగిపల్లి వెంకటరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామకృష్ణ, చింత వెంకటస్వామి, కోడి గంగారావు, మైలవరపు రాధాకృష్ణ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సురక్ష

పెరవలి: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా అభివృద్ధి చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని ఉసులుమర్రులో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వైద్యానికి వచ్చిన రోగులతో మాట్లాడి, వారి అనారోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఈ శిబిరంలో 521 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వారిలో ఆరుగురిని ఉన్నత వైద్యం ఆసుపత్రులకు రిఫర్ చేశారని స్థానిక వైద్యురాలు పి. తేజశ్రీ తెలిపారు. ఈ శిబిరంలో ఊపిరి తిత్తుల వైద్య నిపుణుడు పి.మహేశ్వరరావు, జనరల్ సర్జన్ పి. రవి కుమార్, ఎ. కృష్ణవేణి రోగులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ వీరమళ్ళ నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జన్ని వరలక్ష్మి, పార్టీ నాయకులు రామడుగుల సూర్యనారాయణ, దొలూరి శ్రీను, వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పెరవలి మండలం ఉసులుమర్రులో రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు



త్యాజంపూడిలో రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దమ్మెన్నులో 305 మందికి..

ఉండ్రాజవరం: మండలంలోని దమ్మెన్ను గ్రామంలో సర్పంచ్ గుర్లజర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.ఉషాదేవి (జనరల్ మెడిషన్) ఆధ్వర్యంలో ఎస్‌జే ఇర్ఫాన్ (జనరల్ మెడిసిన్), సునీల్‌రాజు (ఈఎన్‌టీ), వైవీఎస్ ప్రసాద్ (ఆప్తమాలజీ) 305 మందికి వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. శిబిరానికి హాజరైన నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీటీసీ సభ్యుడు గెద్దం రామకృష్ణ, ఎంపీడీవో జీఆర్‌కే రాజు, తహసీల్దార్ జి.కనకరాజు, సచివాలయ , ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోతవరంలో 814 మందికి..

నల్లజర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా గ్రామీణులకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని పోతవరంలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే తలారి సందర్శించారు. వైద్య శిబిరాన్ని పోతవరం సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యులు పాపా నాగేశ్వరరావు, చిడిపి చింతయ్య ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్లు ఝూన్సీరాణి, సుమంత్, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు రాజశేఖర్, గంగాధరం 814 మందికి వైద్య సేవలు అందించారు. వారిలో ఆరుగురిని ఉన్నత వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, నల్లజర్ల, పోతవరం సొసైటీల అధ్యక్షులు కారుమంచి రమేష్, పెండ్యాల హరే రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఏలేటి సత్యనారాయణ, తహసీల్దార్ కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్యాజంపూడిలో 622 మందికి..

దేవరపల్లి: మండలంలోని త్యాజంపూడి గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన వైద్య శిబిరాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. శిబిరంలో డాక్టర్లు నాగదేవి, పి.ఉమాశంకర్, సీహెచ్ చక్రవర్తి, పి.సునీతలు 622 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు దేవరపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాంబశివరావు తెలిపారు. వారిలో 22 మందిని ఉన్నత వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేసినట్టు తెలిపారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన వైద్య పరీక్షల వార్డులను, ఐసీడీఎస్ వంటకాల స్టాల్స్‌ను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరిశీలించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ కుసులూరి వెంకట సతీష్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పార్టీ మండల రైతు విభాగం అధ్యక్షులు పల్లి వెంకట రత్నారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కాకర్ల శోభన్‌కుమార్, పోతుల కృష్ణారెడ్డి, మండల ప్రత్యేకాధికారి రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలవలపల్లిలో 470 మందికి..

చాగల్లు: మండలంలో కలవలపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిర నిర్వహించారు. ఈ శిబిరంలో 470 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం పెద్దాసుపత్రులకు రిఫర్ చేశారు. కళ్లజోళ్లను, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల లక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి శివ, ఎంపీటీసీ సభ్యులు ముళ్లపూడి గంగాభవాని, చాపల రాధ, నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనసేనను వీడి వైఎస్సార్ సీపీలోకి..



కొనగల మురళిని వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రులు వనిత, అంబటి

తాళ్లపూడి: పెద్దేవం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు కొనగల మురళి వైఎస్సార్ సీపీలో చేరారు. మురళికి బుధవారం తాడిపూడి గ్రామంలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొనగల మురళి మాట్లాడుతూ తన భార్య శేషుకుమారి జనసేన పార్టీ తరఫున జెడ్పీటీసీ అభ్యర్థిగా గత ఎన్నికల్లో పోటీ చేసిందన్నారు. అయినప్పటికీ కూడా తమకు జనసేనలో తగిన గుర్తింపు లభించడం లేదన్నారు. అదీగాక జనసేన పార్టీని ఇప్పుడు టీడీపీ తాకట్టు పెడుతున్నారన్నారు. ఈ రెండు కారణాల వల్లా తాను జనసేన పార్టీని వీడి తోట రామకృష్ణ ప్రోత్సాహంతో వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, నాయకుడు తోట రామకృష్ణ, మండల నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగులకు బోనస్ ప్రకటించాలి

రాజమహేంద్రవరం సిటీ: పోస్టల్ ఉద్యోగులకు దసరా బోనస్‌ను ఇంకా ప్రకటించక పోవటాన్ని నిరసిస్తూ అఖిల భారత తపాలా ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు రాజమహేంద్రవరం పోస్టల్ డివిజనల్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం తపాలా డివిజన్ గ్రూప్ సి యూనియన్ కార్యదర్శి బి.కొండబాబు మాట్లాడుతూ దసరా ముందు ఉద్యోగులకు చెల్లించాల్సిన బోనస్‌ను ఇంకా ప్రకటించకపోవటం దుర్మార్గమన్నారు. కావాలనే కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు యాజీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

75 మందికి హోమియో వైద్య సేవలు



హోమియో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: స్వచ్ఛంధ సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. డాక్టర్ హేషాస్ హోమియో హెల్త్ కేర్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని బీసీ కల్యాణ మండపంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.శిబిరంలో 75 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైద్యులు ఎం.హెస్మా, ఎం.సుష్మా, హరిక, శ్రీరచన, తేజస్వి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగంటి కృపానందం, జిల్లా కార్యదర్శి మద్దిపాటి ఫణీంద్ర, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైలు ఎక్కుతూ జారిపడి వృద్ధుడి మృతి

కొవ్వూరు: విజయవాడ-కాకినాడ ఫాస్ట్ ప్యాసింజర్ రైల్ ఎక్కే ప్రయత్నంలో జారి కింద పడి గుర్తుతెలియని వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన కొవ్వూరు రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడికి సుమారు 60 ఏళ్ల వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. రైలు ఎక్కే ప్రయత్నంలో జారి ట్రాక్‌కు, ప్లాట్‌ఫారం మధ్య పడి ఆ వృద్ధుడు మృతి చెందినట్టు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై జి.శ్రీహరిబాబు తెలిపారు. మృతుడి ఒంటిపై తెలుపురంగు కురచ చేతుల చొక్కా, నీలం రంగు కాటన్ ప్యాంటు ఉన్నట్లు ఆయన తెలిపారు. మృతుడి వద్ద ఈ నెల 23న తీసిన సికింద్రాబాద్ నుంచి రాజమహేంద్రవరం వరకూ జనరల్ ట్రైన్ టిక్కెట్ లభించిందన్నారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి భద్రపరిచినట్టు శ్రీహరి బాబు తెలిపారు. వివరాల కోసం 94906 17090, 70133 02296 అనే నంబర్లకు కాల్ చేయాలని ఎస్సై సూచించారు.

వేంకటేశ్వరుని హుండీల ఆదాయం రూ 2.39 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు, మహిళలు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామి వారి హుండీని, ఇక్కడి ఉప ఆలయాల హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. 34 రోజులకు గాను రూ.2.39 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. అలాగే ఇరాన్ కరెన్సీ నోట్లు 47, పాత రెండు వేల రూపాయిల నోటు ఒకటి వచ్చిందన్నారు. అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించామని తెలిపారు. హుండీ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు సహకారంతో ప్రతి శనివారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్నామని చెప్పారు. హుండీల ఆదాయం లెక్కింపులో తీపర్రు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి ఎం.రామయ్య, పంతం చిన్న, పులపర్తి నాగరాజు, పంతం నాగేశ్వరరావు, యాళ్లబండి శ్రీనివాస్, కోటిపల్లి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవాకేంద్రం ప్రారంభం

సీటీఆర్ఐ: బీఎస్ఎన్ఎల్ ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలందించేందుకు వినియోగదారుల సేవాకేంద్రాన్ని ప్రారంభించినట్లు జీఎం పలివెల రాజు అన్నారు. గోకవరం బస్టాండ్ వద్ద గల నన్నయ సంచార భవనంలో బుధవారం కస్టమర్ డిలైట్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులకు మరిన్ని విస్తృత సేవలు అందించేందుకు ఈ సెంటర్ దోహదపడుతుందన్నారు. పలు రకాలైన సేవలను వినియోగించుకుని, సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలో కొత్తగా ఆరు నెలలకు కేవలం రూ.999 లకే ఫైబర్ నెట్ ప్లాన్ అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. కార్యక్రమంలో డీజీఎంలు రాజశేఖర్ బాబు, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ



అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత



దుద్దుకూరులో అగ్నిబాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి: మండలంలోని రావులపాడులో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కోలిశెట్టి కృష్ణ కుటుంబాన్ని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత బుధవారం పరామర్శించారు. ఈ ప్రమాదంలో రెండు కుటుంబాలు నివాసాలు కోల్పోయాయి. కాలిపోయిన ఇంటిని పరిశీలించిన ఆమె ప్రమాదం జరిగిన తీరు గురించి బాధితులను అడిగి తెలుసుకున్నారు. కృష్ణ కుటుంబ సభ్యులకు రెండు పక్కా ఇళ్లు మంజూరు చేశామని మంత్రి వనిత ప్రకటించారు. బాధిత కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం, 50 కేజీల చొప్పున బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు తోట రామకృష్ణ, కొలిశెట్టి నాగేశ్వరరావు, దొరాజీ పాల్గొన్నారు.

దుద్దుకూరులో ఎమ్మెల్యే తలారి పరామర్శ

దేవరపల్లి: దుద్దుకూరులో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన రెండు కుటుంబాలను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బుధవారం పరామర్శించారు. ఈ ప్రమాదంలో కాండ్రుకోట సోమరాజు, మంగిన సతీష్‌లకు చెందిన రెండు తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమై, సుమారు రూ.12 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు తహసీల్దార్ ఎం.రామకృష్ణ ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు. కాలిపోయిన ఇళ్లను ఎమ్మెల్యే తలారి పరిశీలించారు. తన వంతు సాయంగా రూ.5 వేల చొప్పున ఆయన అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు సమకూర్చిన రూ. 5 వేల విలువైన నిత్యావసర సరుకులను కూడా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బాధితులకు అందజేశారు. ప్రభుత్వం ద్వారా ఒకొక్కరికి 25 కిలోల బియ్యం, నిత్యావసరాలను తహసీల్దార్ ఎం.రామకృష్ణ అందజేశారు. ప్రభుత్వం ద్వారా రావలసిన సహాయాన్ని త్వరలో అందిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కోలాహలంగా అమ్మవారి ఊరేగింపులు



దేవరపల్లిలో బాల దుర్గమ్మను ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకు వెళుతున్న భక్తులు



పెరవలి మండలం ముక్కామలలో కనకదుర్గమ్మ వారి ఊరేగింపు

పెరవలి: దసరా మహోత్సవాలు ముగియడంతో మండలంలోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ వారి విగ్రహాలను బుధవారం ఊరేగించి గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ముక్కామల, పెరవలి, తీపర్రు, కాకరపర్రు గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీల్లోను, పూల మండపాల్లోను ఉంచి గ్రామ వీధుల్లో బ్యాండ్ మేళాలు, బాజా భజంత్రీలతో ఊరేగించారు. అనంతరం గోదావరి, కాలువల్లో వాటిని నిమజ్జనం చేశారు.

దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనాల సందడి

దేవరపల్లి: దేవీశరన్నవరాత్ర మహోత్సవాలు ముగియడంతో అమ్మవారి ఉత్సవ విగ్రహాల నిమజ్జనాల సందడి ఏర్పడింది. తొమ్మిది రోజుల పాటు పూజల అనంతరం దుర్గాదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై గ్రామాల్లో ఊరేగించి నిమజ్జనం చేస్తున్నారు. దేవరపల్లిలో వేంచేసిన బాలదుర్గమ్మ అమ్మవారిని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో వైభవంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. గరగలు, బుట్ట బొమ్మల నృత్యాలతో అమ్మవారి ఊరేగింపు సందడిగా జరిగింది.

చాగల్లు మండలంలో..

చాగల్లు: దసరా ఉత్సవాల ముగింపులో భాగంగా మండలంలో వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. చాగల్లులో కనకదుర్గమ్మ అమ్మవారిని, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు తదితర గ్రామాల్లో అమ్మవారిని అత్యంత వైభవంగా బాణసంచా కాల్పులు, డప్పు వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం అందిస్తున్నాం



చాగల్లులో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి తానేటి వనిత



వడ్లూరులో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

- హోం మంత్రి తానేటి వనిత
- చాగల్లు, వడ్లూరుల్లో గడప గడపకూ..

చాగల్లు: అర్హులైన ప్రతి ఒక్కరికీ కులమతాలు, వర్గాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. చాగల్లు సచివాలయం -5 పరిధిలో బుధవారం ఆమె గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులతో మంత్రి ఆప్యాయంగా మాట్లాడుతూ వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమాన్ని లెక్కలతో సహా కుటుంబ సభ్యులకు ఆమె వివరించారు. కార్యక్రమానికి ముందుగా డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో హోం మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలనే కాకుండా, ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అందుకే ప్రజలందరూ ముఖ్యమంత్రికి నీరాజనాలు పలుకుతున్నారన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సీఎం రూపొందించారని ఆమె తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సచివాలయ సిబ్బంది, అన్ని శాఖల అధికారులను హోం మంత్రి వనిత ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, కో-ఆప్షన్ సభ్యులు ఎస్‌కే పాషా, ఎంపీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజలు హ్యాపీ

ఉండ్రాజవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై రాష్ట్ర ప్రజలు సంతృప్తిగా ఉన్నారని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని వడ్లూరు గ్రామ బీసీ, జగనన్న కాలనీల్లో నాలుగో రోజు బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లారు. గత నాలుగున్నరేళ్లగా ప్రభుత్వం ద్వారా గ్రామ ప్రజలు పొందిన లబ్ధిని ఆయన వివరించారు. మరోపక్క ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటుగా ఇవ్వని హామీలను కూడా అమలు చేసి సీఎం జగన్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ ప్రభుత్వంలో వడ్లూరు గ్రామాన్ని రూ.27 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశామన్నారు. అంతేగాకుండా గ్రామస్తులకు రూ.17.50 కోట్ల మేర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, సొసైటీ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ శ్రీనివాసు, ఎంపీటీసీ సభ్యురాలు వేండ్ర అనంతలక్ష్మి, వేగిశ్న నాగరాజు, రాపాక కొండయ్య, బయ్యే సత్తిపండు, రఘుమండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కం రైలు వంతెన రోడ్డు పనులు ప్రారంభం

- మరమ్మతులకు మరో వారం, పది రోజులు



కొవ్వూరు-రాజమహేంద్రవరం రోడ్డు కం రైలు వంతెనపై కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు



రోడ్డు కం రైలు వంతెనపై జాయింట్ల వద్ద పనులు చేస్తున్న దృశ్యం

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెన మరమ్మతు పనులు మొదలయ్యాయి. కొవ్వూరు వైపు నుంచి మంగళవారం తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. మరో నాలుగు రోజుల్లో ఈ పనులు పూర్తయ్యే అవకాశం ఉందని ఆర్ అండ్ బీ అధికారులు చెబుతున్నారు.సెంటర్ లైన్ మార్కింగ్,క్రేబ్ పెయింటింగ్ పనులు, భారీ వాహనాలు వెళ్లకుండా రెండు వైపులా గడ్డర్‌లు వేయడానికి వారం రోజులు సమయం పట్టే ఛాన్స్ ఉందని భావిస్తున్నారు. దీంతో నవంబర్ 5వరకూ సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాస్తవానికి ఈనెల 26 నాటికి పనులు పూర్తి చేయాలని భావించారు. నెల రోజుల పాటు మరమ్మతుల కారణంగా బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేశారు. పనులు పూర్తి కాకపోవడంతో మరో వారం,పది రోజుల సమయంలో పట్టే అవకాశం ఉంది. జిల్లా కలెక్టర్‌తో చర్చించి తుది నిర్ణయం వెల్లడించనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

సారా కేసులో పాత నిందితురాలి అరెస్టు

కొవ్వూరు: సారా కేసులో పాత నిందితురాలైన తాళ్లపూడి మండలం, అన్నదేవరపేటకు చెందిన కొల్లి మేరీని బుధవారం అరెస్ట్ చేసినట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. నిందుతురాలిని కొవ్వూరు కోర్టులో హాజరు పరిచినట్టు చెప్పారు.

సమస్యాత్మక వీధుల్లో సీసీ కెమెరాలు

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని సమస్యాత్మక వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక 30వ డివిజన్‌లో ఇన్‌చార్జి మజ్జి నూకరత్నం ఆధ్వర్యంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఈ విధంగా అనుసంధానం చేస్తే ఆకతాయిలు, పెడదారి పట్టిన యువకుల కదలికలపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. అలాగే వీధులలో కొన్ని మౌలిక సమస్యలను ఆయన అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి క్షేత్రస్థాయిలోనే పరిష్కరించారు. డివిజన్ పరిధిలోని తోట వీధి, చింతలపేట, అన్నపూర్ణమ్మ పేట, మదన్ సింగ్ పేటల్లో పర్యటించారు. పూర్వం నిర్మించిన చిన్న డ్రెయినేజీలను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విస్తరించాలన్నారు. అశోక థియేటర్ వెనుక ప్రహరీ పక్కనే గాజు సీసా పెంకులు, చెత్తా చెదారం పేరుకు పోయిన ప్రాంతాన్ని వెంటనే శుభ్రం చేయించాలన్నారు. స్వామి థియేటర్ పక్కన అశోక థియేటర్ వెనుక ప్రాంతంలో ఉన్న రోడ్డులో గంజాయి తాగుతున్న యువకులు తిరుగుతున్నారని, ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయని స్థానికులు వాపోయారు. ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. వైఎస్సార్ సీపీ క్లస్టర్ ప్రెసిడెంట్ మజ్జి అప్పారావు, మాజీ కార్పొరేటర్ నల్లా రామాంజనేయులు, ఎస్కే మస్తాన్, ఓంకార్ పాల్గొన్నారు.